# అదంతేలే

**అమృతపాణి**






రెక్కాడితేనేగానీ డొక్కాడని జీవితాలు కొందరివి! వర్గ తారతమ్యాల గురించిగానీ, తమకుండాల్సిన ప్రాథమిక హక్కుల గురించిగానీ వాళ్లాలోచించరు. పనివాళ్ల ఉన్నప్పుడు, యజమానులు కూడా ఉండితీరాలని, వాళ్ల గట్టిగా నమ్ముతూంటారు!

వాళ్ల కోరుకునేదల్లా ఒక్కటే - తుమ్మితే ఊడిపోకుండా కొంతకాలంపాటన్నా కొనసాగే ఉద్యోగం! ఆ కోవకి చెందిన మనిషే- పంకజం కూడాను. తనకి తెలిసిన పని వంట చెయ్యడం. తను చేసే ఘుమఘుమలాడే వంటకాల్ని యజమానులు తింటూ మెచ్చుకొంటూంటే తెగ ఆనందపడిపోతుంది! చేసిన పనికి ప్రతిఫలంగా నెల జీతం ఇచ్చే యజమాని ఆమెకి దేవుడికి మల్లేనే కనపడతాడు!

మొగుడు పోవడం, నలుగురు పిల్లల్ని పెంచాల్సిన భారం తనమీద పడడంతో, నలుగురిళ్లల్లోనూ వంట చెయ్యడం మొదలుపెట్టింది.

పని దొరికినప్పుడు సంతోషిస్తూ, పనిలేనప్పుడు బాధపడుతూ జీవితాన్ని నెట్టుకొస్తోంది.

ప్రస్తుతానికి ఆమె మంచి ఇంట్లోనే పనికి కుదురుకుంది. ఊరవతలున్న పెద్ద బంగ్లాలో ఉంటున్న సంపన్నులయిన నూతన దంపతులు నెలకి మూడువేల రూపాయల జీతం మీద, వంట చెయ్యడానికి పంకజాన్ని కుదుర్చుకున్నారు.

వ్యాపారస్తుల కుటుంబానికి చెందిన యజమాని పేరు వీరభద్రం. మనిషి పొట్టిగా లావుగా నల్లగా ఉంటాడు. మాట దురుసు. ప్రవర్తన మోటుగా ఉంటుంది. ఏం చెప్పినా తను చెప్పినదానికి తిరుగు లేదన్నట్టుగా చెప్తాడు. అలా అని చెప్పి అతిగా మాటాడ్డు. అతి తక్కువగా మాటాడతాడు. అతణ్ణి అతని తాలూకు మనుషుల్నీ చూసిన వాళ్లకెవళ్లకయినా తెలుస్తుంది - అతని కుటుంబం అతి తక్కువ స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకుందని.

వీరభద్రం భార్య పేరు ఐశ్వర్య. వాళ్ల పుట్టింటి వారిది జమీందారీ కుటుంబం. కానీ ఎస్టేట్లు పోవడంతో, వాళ్ల ఆస్తిపాస్తులు వాళ్ల జమీందారీ ఖర్చులకి తట్టుకోలేక క్రమేపీ హరించుకుపోయాయి! బాగా డబ్బున్నవాడు కదా అని వీరభద్రానికిచ్చి పెళ్ళి చేశారు ఐశ్వర్యని. ఐశ్వర్య ప్రతి మాటలో, కదలికలో జమీందారీ దర్జా కనిపిస్తూనే ఉంటాయి.

పొడుగ్గా, అందంగా, తెల్లగా, మెరుపుతీగలా ఉంటుంది ఆమె! ముఖ్యంగా ఆమె నీలి చక్రాల్లాంటి కళ్లని చూసి తీరాలి!! వాళ్లిద్దర్నీ చూసినప్పుడల్లా అనిపిస్తుంది జంతువులాంటి మనిషికి రంభలాంటి అందగత్తె ఎలా దొరికిందా- అని!

* * *

పొద్దుటే వీరభద్రం ఫలహారం ముగించుకొని, ఖరీదయిన కారులో ఊళ్లోకి వెళ్తాడు. పగలంతా వ్యాపార విషయాల్లో మునిగి తేలి రాత్రిక్కాని తిరిగిరాడు. ఈలోగా ఐశ్వర్య కాలాన్ని తనదైన పద్ధతిలో గడుపుతుంది. పొద్దుటపూట - సుఖమైన కుషన్ సోఫాలో కాళ్ల మడతపెట్టుక్కూచుని పేపర్లు చదువుతూ గడుపుతుంది. ఆ తర్వాత ఇంటి చుట్టూ ఉన్న అందమైన ఉద్యానవనంలో తిరుగుతుంది. ఒక్కొక్కప్పుడు పంకజం వెనగ్గానుంచుని ఆమె చేస్తోన్న వంటకాల్ని గమనిస్తూంటుంది. మరొకప్పుడు తోటమాలి చేస్తున్న పనుల్ని చూస్తూ గడిపేస్తుంది. సాయంత్రం పూట ఎస్కార్ట్ కారు డ్రైవ్ చేసుకొంటూ షాపింగ్ చేసుకొని వస్తుంది. పనివాళ్లతో ఎంతో అవసరం అయితేనేగానీ మాట్లాడదు. పంకజం ఆమె కనుసన్నల ప్రకారం పనిచేసుకుపోతుంటుంది. ఆమెని మెప్పించడం తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తుంది. ఎందుకంటే, ఆమే పంకజాన్ని పనిలో పెట్టుకొంది. రాత్రవుతుంటే వీరభద్రం తిరిగొస్తాడు. గేటు బయట, కారుహారన్ చప్పుడవటమే తడవు, వాచ్‌మెన్ గబగబా పరుగెట్టుకెళ్ళి గేటు తీస్తాడు. పనివాళ్లు ఒక పక్కకి ఒదిగి నుంచుని అతనికి సెల్యూట్ చేస్తారు. పంకజం భోజనానికి ఏర్పాట్లు చెయ్యడంలో నిమగ్నమైపోతుంది. అంతవరకూ స్తబ్దుగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా హడావుడిగా మారిపోతుంది!

అటూ ఇటూ ఆల్సేషియన్ కుక్కలు

పరుగెడుతుంటే అతను మహారాజులా ఇంట్లోకి ప్రవేశిస్తాడు. విశాలమైన మెయిన్ హాల్లోకి ప్రవేశిస్తూనే "రెడీ అయిందా?" అంటాడు.

ఖరీదయిన సోఫాలో జేరగిలబడి కూచున్న అతణ్ణి చేతులూ ఛాతీని నిమురుతూ వారిస్తుంది ఐశ్వర్య! ఒక్కొక్కప్పుడు తన చెంపని అతని చెంపకి ఆనించి అతనికేసి గోముగా చూస్తుంది!

పంకజంగానీ, పనివాళ్లుగానీ, అదంతా చూస్తూ కూడా చూడనట్టుగా ప్రవర్తిస్తారు! పనివాళ్లు నడుచుకోవాల్సిన పద్ధతి అదే.

పంకజం తలుపు వారగా నిల్చొని "అన్నం వడ్డించాను. వేడివేడిగా ఉండగానే తింటే బావుంటుందమ్మా" అంటుంది. ఇద్దరూ డైనింగ్ హాల్లోకి వస్తారు.

అతను డైనింగ్ టేబిల్ దగ్గిర కూచోవడం ఏమిటి- ఆబగా ఆత్రంగా అవతలివాళ్లు చూస్తున్నారేమోనన్న స్పృహలేకుండా కంచం దొరకపుచ్చుకొని భోంచెయ్యడం మొదలుపెడతాడు. అన్నంలోకి పప్పుకూరలు, పచ్చళ్లు, పులుసు. ఇలా ఒకదాని తర్వాత మరొకటి వాయలకి మళ్లే కలిపి పెద్ద పెద్ద ముద్దలు చేసుకొని తింటుంటే పంకజానికి మాయాబజార్లో ఘటోత్కచుడు గుర్తొస్తాడు.

పెరుగన్నంలోకి మామిడిపండు రసం కలుపుకొని జుగుప్సాకరమైన పద్ధతిలో జుర్రుకొని తింటూంటే, అతణ్ణి చూసిన వాళ్లకెవళ్లకయినా అసహ్యమేస్తుంది.

అయితే ఏం-

తను చేసిన వంటకాల్ని ఇష్టంగా తింటూ అతను మెచ్చుకోలుగా చూసే చూపులకి, ఆమెకి అమితమైన ఆనందం కలుగుతూంటుంది!


కానీ - అతను భోంచేసే పద్ధతి ఐశ్వర్యకి ఎంతమాత్రం నచ్చినట్టు కనపడేదికాదు.

'రోడ్డు పక్కనున్న చిన్న చిన్న హోటళ్లలో భోజనం చేసే కూలిజనం నయం. ఇతనికంటే -అన్న భావాన్ని వ్యక్తపరిచేది తన ఈసడింపు చూపుల్లో!

కానీ అతనదేమీ పట్టించుకోనట్టుగా తన గొడవలో తనుండేవాడు! మధ్య మధ్యలో ఆమెని మరింత రెచ్చగొట్టడానికన్నట్టుగా మరింత ఏబ్రాసితనంగా భోంచేసేవాడు!

ప్రతిరోజూ భోజన కార్యక్రమం ఆ విధంగానే సాగేది! ఆ భార్యాభర్తలు సాగించే మౌనపోరాటాన్ని చూస్తూ కూడా చూడనట్టుగా నటిస్తూండేది పంకజం. అలా నెలరోజులు గడిచేప్పటికి పంకజం ఆ ఇంటి మనుషుల ప్రవర్తనకి అలవాటు పడి అక్కడే మరికొంతకాలం కొనసాగితే బావుణ్ణని అనుకోవడం మొదలుపెట్టింది. అదిగో - సరిగ్గా అప్పుడే చెలరేగింది తుఫాను!

ఒకరోజు -



## గేమ్

**"ఈ**మధ్య హీరోయిన్లు వెండితెర మీద నటించడం మానేశారు. గేమ్ ఆడటం మొదలుపెట్టారు. ఎవరెంత చాకచక్యంగా గేమ్ ఆడగలిగితే వాళ్ళకన్ని అవకాశాలు ఈ విషయంలో నేను ఎగ్జెంప్షన్. ఎందుకంటే గ్లామరూ, గ్రామరూ చూపించడం వరకే ఓ.కె. అంతకు మించి గేమ్ ఆడటం నాకు చేతకాదు" అంటోంది దియామిర్జా.*(ఇదో రకం గేమ్ కాదా?)*

అతను తనదైన పద్ధతిలో ఆబగా ఆత్రంగా భోంచేస్తున్నాడు. ఎదురుగ్గా కూచుని, తనకేసి అసహ్యంగా చూస్తున్న ఐశ్వర్యని రెచ్చగొట్టడానికన్నట్టుగా, వింత వింత శబ్దాలు చేస్తూ గుర్రుగా ఆమెకేసి చూస్తున్నాడు!

ఇక ఏమాత్రం భరించలేకపోయింది ఆమె! ఉన్నదున్నట్టుగా మాట్లాడేయాలనుకొంది! తీక్షణమైన స్వరంతో "ఏమిటి ఆ భోంచేయడం! కంచం చుట్టూ ఉన్న ఆ మెతుకులేమిటీ!! చెయ్యి నాక్కుంటూ ఆ తినడం ఏమిటి?! మీకంటే మనింట్లో పనాళ్లు కూడా నీట్‌గా భోంచేస్తారు! నేర్చుకోండి ఇప్పటికయినా-" అంది.

అతను గబుక్కున షాక్ తిన్నట్టయి "ఏమంటున్నావ్?!" అని కోపంగా అరిచాడు.

ఆమె కూడా ఏమాత్రం తగ్గకుండా "మీకంటే మనింట్లో పనివాళ్లు కూడా నీటుగా భోంచేస్తారన్నాను" అంది.

దాంతో అతను రెచ్చిపోయి "అయితే నీ ఉద్దేశంలో నేను పనివాళ్లకంటే హీనం అన్నమాట! మరి నీ సంగతేమిటి?" అన్నాడు.

ఆమె వణుకుతున్న స్వరంతో "నా సంగతేమిటో నాకు తెలియదు కానీ - ముందు సరిగ్గా భోంచెయ్యడం నేర్చుకోండి" అంది.

"భోంచెయ్యడం ఎలాగో నువ్వా నాకు చెప్పేది! పూటకి గతిలేని కొంపనుంచి వచ్చావ్! నువ్వు నాకు చెప్తావ్?!" ఉరిమినట్టుగా అరిచాడు.

"మా పుట్టింటివాళ్లు డబ్బు లేనివాళ్లు కావచ్చుకానీ - మీలా అసహ్యంగా మాత్రం భోంచెయ్యరు" అందామె.

"ఏమన్నా ఉంటేగదా భోంచెయ్యడానికి! మీవాళ్లకంటే బిచ్చగాళ్లు నయం!" అన్నాడు తీవ్రస్థాయిలో.

"మావాళ్లు బిచ్చగాళ్లలా కనపడుతున్నారా?! మీకేం పిచ్చిగాని పట్టలేదు కదా" అందామె అక్కసుగా.

పంకజం వాళ్లిద్దరికేసి తెల్లబోయి చూస్తోంది.

"నాకు పిచ్చి పట్టిందంటావా? నీ పిచ్చి వదలగొడతానుండు" అని ఒక్క ఉదుటన లేచి ఆమె వైపుకి వెళ్లాడు,

"ఏం చేస్తారేమిటి?" అందామె కోపంగా.

"ఏం చేస్తానా?" అంటూ ఆమె చెంప చెళ్లుమనిపించాడు!

ఆమె ఆ షాక్‌లోంచి తేరుకోకముందే, మళ్లీ మరో దెబ్బ వేశాడు! అవాక్కయిపోయింది ఆమె!

ఏడుస్తూ అవతలికెళ్లిపోయింది. ఆమె వెనకే అతనూ వెళ్లాడు! పంకజం నివ్వెరపోయి చూస్తోంది... అవతలి గదిలోంచి ఏడుపులు, పెడబొబ్బలు వినపడుతున్నాయి. అతను గట్టిగా అరుస్తున్నాడు!

పంకజానికి ఏం చెయ్యడానికీ పాలుపోవటం లేదు. నెమ్మదిగా టేబుల్ క్లీన్ చేసి వంటింట్లో సామాన్లు సర్ది ఇంటిముఖం పట్టింది.

మర్నాడు పొద్దుటే పంకజానికి ఐశ్వర్య ఎదురయింది!

రాత్రంతా ఏడిచి ఉంటుంది. కళ్లు వాచిపోయి ఉన్నాయి. మొహం ఉబ్బినట్టుగా ఉంది. పంకజానికి ఆమెని చూస్తుంటే నిజంగా జాలేసింది. ఎంతటిస్థాయిలో ఉంటే మాత్రం ఏం లాభం? ఆడది ఆడదే?! అనుకొంది.

ఐశ్వర్య ఆమెకేసి చూస్తూ "నువ్వు రేపటినుంచి పనిలోకి రానక్కర్లేదు".

నెత్తిమీద పిడుగు పడినట్టయింది పంకజానికి!

"పనిలోంచి తీసేస్తున్నారా? నేనేం చేశానని?!"

"ఏంచేశావా? నిన్నరాత్రి జరిగిందంతా కళ్లారా చూశావ్. నీక్కూడా చులకనయిపోవడం నాకిష్టం లేదు."

"అమ్మా... మరొక్కమారు ఆలోచించండి" పంకజం వేడుకొంది.

"ఆలోచించే సమస్యే లేదు. నా నిర్ణయానికి తిరుగులేదు. ఇదిగో ఇప్పటిదాకా నీకు రావలసిన జీతం. నువ్వు వెళ్లొచ్చు" అంది ఐశ్వర్య స్థిరమైన స్వరంతో.

బాధపడుతూ ఇంటికి తిరిగొస్తూ అనుకుంది పంకజం "తుంటిని కొడితే పళ్లు రాలడం అంటే ఇదేనేమో!" అని.